క్లుప్తంగా

4న వడ్డాదిలో రన్నింగ్, వాకింగ్ పోటీలు

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో వాక్ ఫర్ యాంటీ డ్రగ్స్ పేరుతో రన్నింగ్, వాకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4న స్నేహితుల దినోత్సవం సందర్భంగా యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యాంటీ డ్రగ్స్ రన్నింగ్‌లో 15 నుంచి 30 ఏళ్ల లోపు యువకులు, వాకింగ్‌లో 30 నుంచి 60 ఏళ్లలోపు వారు పాల్గొనాలన్నారు. అదే రోజు గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న జరిగే మెగా రక్తదాన శిబిరం యూత్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. సామాజిక బాధ్యత గల పౌరులు, ఉద్యోగులు, కార్మిక, కర్షక, పెద్దలు, వ్యాపారులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మోదమాంబ ఘటాలు ప్రారంభం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో వచ్చే నెల 4న మోదమాంబ పండగ సందర్భంగా అమ్మవారి ఘటాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పుట్టమన్ను తీసుకొచ్చి సతకంపట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ జామి రమణబాబు, ఉత్సవ కమిటీ సభ్యుల సారధ్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు.

కోతదశలో గంటి సాగు



ఎ.కోడూరులో గంటి పంట

కె.కోటపాడు: మండలంలో గంటి పంట కోతదశకు చేరుకుంది. గంటిలో మంచి పోషక విలువలు ఉండడంతో పంటకు మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు లాభదాయకంగా ఉండడంతో మెట్ట ప్రాంత గ్రామాల్లో సాగు చేస్తున్నారు. కె.సంతపాలెం, ఎ.కోడూరు. కె.కోటపాడు, కె.కె.అగ్రహారం, సూదివలస, గుల్లేపల్లి, గరుగుబిల్లి, చిరికివానిపాలెం, గవరపాలెం, తదితర గ్రామాల్లో 60 ఎకరాల్లో పండిస్తున్నారు. 20 రోజుల తర్వాత కోతలు చేపట్టి నూర్పు చేయనున్నట్లు రైతులు చెబుతున్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన వాహనాలు

బుచ్చెయ్యపేట: మండలంలో విజయరామరాజుపేట తాచేరు డైవర్షన్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇటీవల వర్షాలకు ఇక్కడ డైవర్షన్ రోడ్డు గండి పడటంతో అధికారులు తూతూమంత్రంగా రోడ్డు దాన్ని పూడ్చారు. గ్రావెల్, రాయి బుగ్గి వేయకుండా మట్టితో గండిని పూడ్చడంతో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఈ కారణంగా ఆదివారం ట్రాఫిక్ ఏర్పడి వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి పోరాటం



జైభీమ్ సేన సేవా సంఘం నూతన కార్యవర్గం

తుమ్మపాల: దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి పోరాడుతూ, వాటి అభివృద్ధికి జైభీమ్ సేన సేవా సంఘం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రేబాక మధుబాబు చెప్పారు. పట్టణంలో సీపీఐ సమావేశం హాల్‌లో ఆదివారం జై భీమ్ సేన సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 మండలాల కార్యదర్శులు ఎన్నుకున్నామని, మిగతా మండలాల వారిని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో అంబేడ్కర్ భవనం, గ్రంథాలయం ఏర్పాటు కృషి చేస్తామని చెప్పారు. సభ్యులు ఎం.లావచందు, వేలా శివ గణేష్, రేబాక ఇంద్ర కుమార్, మాటూరు మహేష్ సీతారాముడు, గుడాల ఆనంద్ కిరణ్, కొండలరావు, శ్రీకాంత్, మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు

తుపాను వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

- గోతుల్లో నీరు చేరి ప్రమాదాలు
- పూడ్చకపోవడంపై వాహనదారుల ఆగ్రహం



వడ్డాది ఐవోబీ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు



చోడవరం వెళ్లే రహదారిలో పెట్రోల్ బంక్ వద్ద ప్రమాదకరంగా గోతులు



బంగారుమెట్ట చర్చి వద్ద గోతులు పడ్డ రోడ్డు



లోపూడి పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గరలో రంధ్రం పడిన మదుం

బుచ్చెయ్యపేట: తుపాను వర్షాలకు రోడ్లన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి వర్షపు నీరు చేరడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. దాంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. అత్యవసర పనిపై బయటకెళ్లిన వారంతా చీకటి పడక ముందే సాయంత్రం ఐదు గంటల్లోపు ఇంటికి చేరుతున్నారు. రాత్రయితే చీకట్లో ఎక్కడ ఏ గోతుల్లో పడి గాయాలపాలవుతామో, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని హడలిపోతున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో పొట్టిదొరపాలెం, బుదిరెడ్లపాలెం, గొల్లకొంపలు, పొట్టిదొరపాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, వడ్డాది గ్రామాల వద్ద పెద్దపెద్ద గోతులు పడ్డాయి. వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డుపై వచ్చే వాహనదారులు ఎదురెదురుగా తప్పుకునే సమయంలో నీటిలో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం గోతుల్లో గ్రావెల్, రాయి బుగ్గి వేసిన ప్రమాదాలు తప్పేవని, అసలు ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేకు గోతులు కనిపించడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీ వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ వద్ద, పెట్రోల్ బంక్, ఐవోబీ బ్యాంక్ దగ్గర పెద్దపెద్ద గోతులు పడగా, లోపూడి పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గరలో మదుంకు రంధ్రం పడటంతో స్థానిక యువకులు ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణం రోడ్లుపై పడ్డ గోతులను పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

నువ్వు రైతుల గగ్గోలు

- పంట చేతికందే సమయంలో భారీ వర్షాలకు నష్టం
- నాతవరం మండలంలో 900 ఎకరాలకుపైగా దెబ్బతిన్న పంట
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వర్షానికి నేలమట్టమైన పండిన నువ్వుచేను



పొలాల్లో పాడైన నువ్వు కంకులను తొలగిస్తున్న రైతులు

నాతవరం: ఖరీఫ్‌లో పెట్టుబడి సాయంతో ప్రభుత్వం ఆదుకోకపోగా, ఇంతలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో నువ్వు సాగు రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో నువ్వు పంటకు తీవ్ర నష్టం కలిగింది. మండలంలో 928 ఎకరాల్లో నువ్వు సాగు చేశారు. పంట చేతికందే సమయంలో తుపాను రూపంలో ఊహించని నష్టం కళ్ల ముందే జరగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎంతో కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన పంట వర్షానికి పొలాల్లోనే కుళ్లిపోతోందని వాపోతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా నువ్వు చేను కాపు దశలో ఉంది. వారం రోజుల వ్యవధిలో సగానికి పైగా నువ్వు పంట కోత దశకు చేరుకుంది. ఈ తరుణంలో తుపాను వర్షం ధాటికి పొలాల్లో నేలమట్టం అయింది. గతంతో పోల్చుకుంటే నువ్వు పంట వేసిన దగ్గర్నుంచి వాతావరణం అనుకూలించడంతో అనుకున్న దానికి కంటే ముందుగా చేను ఏపుగా పెరిగి కాపు దశకు వచ్చేసింది. నువ్వులకు మార్కెట్లో ధర బాగుడటంతో వచ్చిన డబ్బులతో ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు వేసుకునేందుకు పెట్టుబడి సాయం అందుతాయని రైతులు ఎంతో ఆశ పడ్డారు. వారి ఆశలన్నీ ప్రకృతి రూపంలో అడియాశలు కావడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. అసలే ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయంతో అందించలేదు. అటు ప్రభుత్వం ఆదుకోక, ఇటు ప్రకృతి కన్నెర్ర చేయడంతో సాగు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న నువ్వు పంటను పొల్లాలో దాచుకోలేక బయటకు తరలించలేక తల్లడిల్లుతున్నారు. పొలాల్లోంచి బయటకు తరలించాలంటే కూలీలకు యంత్రాలకు ఖర్చుతో కూడిన పని అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


తుమ్మపాల: కాలుష్యం లేని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గవరపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు మేలు చేయగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాకేష్, కోశాధికారి సత్యనారాయణ, వినోద్ కుమార్, విశ్రాంత అటవీ రేంజర్ రమణ పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి ఉత్సవం

కశింకోట: స్థానిక శారదానది అవతల పొలాల్లో వెదురుపర్తి వద్ద వెలసి ఉన్న సత్తెమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రైతులు, ప్రజలు తరలి వెళ్లి అమ్మ వారికి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

కూలేందుకు సిద్ధంగా భారీ వృక్షం

- కూలితే రెండు జిల్లాల వాహన రాకపోకలకు అంతరాయం



నర్సీపట్నం - తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ వృక్షం

నాతవరం: నర్సీపట్నం - తుని మధ్య ఎం.బెన్నవరం గ్రామ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీ వృక్షం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇక్కడ ప్రమాదకరంగా భారీ వృక్షం వాలిపోయి ఉనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాత్రి పగలు తేడా లేకుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ సమయంలోనైనా భారీ వృక్షం కూలితే అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోతాయి. నాతవరం, కోటనందూరు, తుని మండలాలకు వెళ్లడానికి నర్సీపట్నం నుంచే వెళ్లడానికి ప్రధాన మార్గం ఇదే కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా చింతపల్లి, కొయ్యూరు, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన వారు తుని రైల్వే స్టేషను మీదుగా విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇక్కడ మార్జిన్‌లో భారీ వృక్షం రోడ్డుపైకి వాలిపోయి ఉండటంతో రాత్రిళ్లు భారీ లోడుతో వచ్చే లారీలు ఏమాత్రం ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసినా ప్రమాదం తప్పదు. ఇటీవల పాడేరు, కాకినాడ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సుకు కొమ్మలు తగిలి పెను ప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గాలులకు చెట్టు బాగా వాలిపోవడంతో ఎత్తులోడుతో వచ్చే వాహనదారులు భయపడుతూ నెమ్మదిగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి భారీ వృక్షాన్ని తొలగించాలని కోరుతున్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే బండారుకు వినతి

మాడుగుల రూరల్: కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చెయ్యాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఆదివారం పెద్దేరు జలాశయం నీటి విడుదల చేయడానికి వచ్చిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి జాలంపల్లి వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి, డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడుల సారధ్యంలో వినతిపత్రం అందజేశారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ అమలు చేయాలని, నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పదవీ విరమణ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, కోవిడ్ సమయంలో మరణించిన కార్యకర్తలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, శిక్షణ పొందిన కార్యకర్తలకు ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్స్ నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలని విన్నవించారు. ఆశ కార్యకర్తల మండల యూనియన్ నాయకులు కె. లక్ష్మి, పి.ఎస్. ప్రసన్న, సుభద్రాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు కె. భవానీ పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ నమోదు శిబిరాలు



కుసుర్లపూడిలో చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న నిర్వాహకుడు నాయుడు

రోలుగుంట: చిన్నారులకు ఉచితంగా అందిస్తున్న ఆధార్ నమోదు శిబిరాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయని కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు నాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచిత శిబిరాలు ప్రారంభమయ్యాయి. చివరి రోజు కుసుర్లపూడి, జానకిరాంపురంలో శిబిరం నిర్వహించారు. మండలంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 30 కేంద్రాల్లో వారం రోజుల పాటు ఈ శిబిరాలు నిర్వహించామని, మొత్తం 150 మంది చిన్నారులకు ఆధార్ నమోదు ఉచితంగా చేశామని నిర్వాహకుడు తెలిపారు.

మోదమాంబ పండగ గోడపత్రిక విడుదల



గోడపత్రిక విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో వచ్చే నెల 4న నిర్వహించే మోదమాంబ పండగకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం మాడుగులలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విడుదల చేశారు. అమ్మవారి జాతర ఉత్సవ కమిటీ చైర్మన్, కె.జె.పురం ఎంపీటీసీ భీశెట్టి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో జరిగే పండగకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు, సర్పంచ్ జామి రమణబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు



కె.కోటపాడు: డి.అగ్రహారంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు



కె.కోటపాడు: గవరపాలెంలో పొలాలను దమ్ము పడుతున్న రైతులు



దేవరాపల్లి: రైవాడలో వరినాట్లు వేస్తున్న కూలీలు



దేవరాపల్లిలో మినీ ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

కె.కోటపాడు: ఇటీవల కురిసిన తుపాను వర్షాలతో అన్నదాతలు హుషారుగా ఖరీఫ్ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా వరినాట్లు వేసే పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే నారుమడుల్లో వరినారు ఎదగడంతో దమ్ములు పూర్తి చేసిన పొలాల్లో మహిళా కూలీలతో నాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2,851 హెక్టార్లలో వరి నాట్లు వేయనున్నారు. ప్రస్తుతానికి డి.అగ్రహారం, పొడుగుపాలెం, ఎ.భీమవరం, మేడిచర్ల, రొంగలి నాయుడుపాలెం గ్రామాల్లో 150 ఎకరాలలో వరి నాట్లు వేసే పనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు పొలాల్లో దమ్ములు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వచ్చే నెల రెండో వారంలోగా నాట్లు పూర్తయ్యే అవకాశాలున్నాయని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

ముమ్మరంగా దమ్ములు, వరినాట్లు

దేవరాపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో ఖరీఫ్ సాగు పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేసిన వారు దమ్ములపై దృష్టి సారించారు. నీటి సదుపాయం ఉన్న చోట్ల కొందరు ఇప్పటికే దమ్ములు చేస్తుండగా, మరికొందరు వరి నాట్లు సైతం వేస్తున్నారు. ప్రస్తుతం రైతులంతా ఖరీఫ్ సాగు పనులలో బిజీబిజీగా ఉన్నారు. దీంతో గ్రామాలలో దమ్ము చేసే ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ కూలీలకు డిమాండ్ నెలకొంది. రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు వచ్చే నెల 2న ఖరీఫ్ సాగు నీటిని విడుదల చేయనుండటంతో వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రైవాడ జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 108.20 మీటర్లుగా ఉంది.

వైద్య సిబ్బంది కొరత

- డాక్టరు, హెల్త్ సూపర్‌వైజర్, సీహెచ్‌వో పోస్టుల ఖాళీ
- చౌడువాడ పీహెచ్‌సీలో ప్రధాన వైద్యాధికారిపై అదనపు భారం



చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కె.కోటపాడు: మేజరు పంచాయతీ చౌడవాడ పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ వైద్యాధికారి, హెల్త్ సూపర్‌వైజర్, సీహెచ్‌వో పోస్టుల ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. ప్రస్తుతం అపిడమిక్ సీజన్ కావడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెణ్నెల్ల క్రితం వరకూ పీహెచ్‌సీలో వైద్యాధికారిగా సేవలందించిన బి.సుబ్రహ్మణ్యం పదోన్నతిపై విజయనగరం జిల్లాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి నిర్మలపై అదనపు భారం పడుతోంది. రోజూ పీహెచ్‌సీలో వైద్యం సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తోంది. వీటితోపాటు గ్రామాల్లో వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే ఆస్పత్రిలో హెల్త్ సూపర్‌వైజర్‌గా బాధ్యతలను చేపట్టాల్సిన రమేష్‌నాయుడు డిప్యూటేషన్‌పై రెండేళ్లకు పైబడి అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో 104 విభాగంలో బాధ్యతల్లో ఉన్నారు. ఆయన స్థానంలో మరో హెల్త్ సూపర్‌వైజర్ నియమించలేదు. ఆస్పత్రిలో కమ్యూనిటీ హెల్త్ అధికారిగా పనిచేసిన సింహాచలం ఆర్నెల్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో గ్రామాల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవల పర్యవేక్షణ చేపట్టాల్సిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై భారం పడుతోంది. పీహెచ్‌సీ పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో 37,800 మంది ప్రజలకు సకాలంలో వైద్యం అందని పరిస్థితిలో వైద్యాధికారితోపాటు హెల్త్ సూపర్‌వైజర్, సీహెచ్‌వో పోస్టులను భర్తీ చేయాలని రోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆస్పత్రిలో ఖాళీ వైద్యాధికారి పోస్టుతోపాటు ఇతర సిబ్బంది వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉండడం వల్ల రోగులకు సకాలంలో మరింత మెరుగైన వైద్యం అందించవచ్చు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది సహకారంతో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.
– నిర్మల, వైద్యాధికారి, చౌడువాడ పీహెచ్‌సీ

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న ఆడారి రవిబాబు

అనకాపల్లి: రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించడమే కాకుండా ప్రాణదానం చేసిన వారమవుతామని జిల్లా విద్యాశాఖ ఏడీ ఆడారి రవిబాబు అన్నారు. స్థానిక నాయుళ్లవీధి ఉడ్‌పేట సిటీపబ్లిక్ హైస్కూల్ ఆవరణలో జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌కు చెందిన 1987–88 పదోతరగతి పూర్వ విద్యార్థుల(మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్) ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని ముందు ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతకుముందు 57మంది పూర్వ విద్యార్థులు విశాఖ ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేశారు. మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ సభ్యులు గుండా సాయి,శివకుమార్ పాల్గొన్నారు.

29న విజయవాడలో కేబుల్ ఎక్స్‌పో

తుమ్మపాల: కేబుల్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఈనెల 29 నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహించనున్నట్టు జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకుడు కె.వి.ఎస్. ప్రకాష్ ఆదివారం తెలిపారు. జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్లు అందరూ పాల్గొని విజయం వంతం చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఎత్తున నిర్వహిస్తున్న కనెక్ట్ ఏపీ–2024 కేబుల్ ఎక్స్‌పో, టెక్నికల్ సెమినార్‌కు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యవస్థకు చెందిన నిష్ణాతులు హాజరవుతారన్నారు. జాతీయస్థాయిలో పేరొందిన దేశ, విదేశీ బ్రాండెడ్ కంపెనీలు వందలాది స్టాళ్లు ఏర్పాటు చేసి, తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఆపరేటర్లు ఏ విధంగా ముందుక వెళ్లాలి అనే అంశంపై చర్చించి, దిశా నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేబుల్ సంఘం నాయకులు దాడి ఈశ్వరరావు, పొలమరశెట్టి ఈశ్వరరావు, నడిపల్లి నాగేశ్వరరావు, భేతి వెంకటరమణ,, గెడ్డం భాస్కరరావు, తానాం అప్పారావు, దొడ్డి రాజు పాల్గొన్నారు.